# మిస్టర్ నో ఆల్

## మల్లాది వెంకటకృష్ణమూర్తి



సుబ్బారావుకి ఈ లోకంలో తెలియని మనిషంటూ లేడు. ఎవరి ప్రసక్తి వచ్చినా 'ఓ. అతనా. నా బెస్ట్ ఫ్రెండ్' అంటూంటాడు. బెజవాడ మునిసిపాలిటీలో పనిచేసే రోడ్లు వూడ్చే పనివాడు నించి ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇజ్రాయిల్ దాకా ఎవరి పేరు వచ్చినా, ఎవరి ప్రసక్తి తెచ్చినా సరే 'అతనా. నా బెస్ట్ ఫ్రెండ్' అంటాడు. ఎలా ఫ్రెండంటే 'ఏలూరు కాలవలో కలసి చేపలు పట్టేవాళ్ళం' అనో, 'ఓసారి విమానంలో వెళ్తుంటే నా పక్క సీట్లో కూర్చుంటే పరిచయం' అనో చెప్తాడు.

సుబ్బారావు పని చేసేది గన్నవరంలోని పోస్ట్ ఆఫీసులో. అతని సంగతి తెలిసి అంతా అతనికి 'మిస్టర్ నో ఆల్'గా పేరు పెట్టారు. 'మిస్టర్ నో ఆల్' గురించి క్రమంగా పోస్ట్ మాస్టర్ జనరల్‌కి, ఆయన ద్వారా టెలి కమ్యూనికేషన్స్ మినిస్టర్‌కి తెలిసింది.

ఆయన ఓసారి బెజవాడలోని ఓ కొత్త పోస్ట్ డబ్బా ఆవిష్కరణకి ఢిల్లీ నించి వచ్చినప్పుడు ఆయనకి పూలదండ వేసింది సుబ్బారావు కూతురే. ఎవరి ప్రసక్తో వస్తే 'ఆయనా, మా నాన్నగారి బెస్ట్ ఫ్రెండ్' అన్నది సుబ్బారావు కూతురు.

వెంటనే ఆ మంత్రివర్యుడు హుటాహుటిగా సుబ్బారావుని పిలిపించి అడిగాడు-

"నీకు 'మిస్టర్ నో ఆల్' అన్న పేరు ఎందుకు వచ్చింది?"

"ఈ ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ నాకు బెస్ట్ ఫ్రెండ్ కనక" వినయంగా సమాధానం చెప్పాడు సుబ్బారావు.

"అదెలా సాధ్యం? నేను నమ్మను" చెప్పాడు మంత్రి.

"కావాలంటే పరీక్షించుకుని నమ్మండి" వినయంగానే ఛాలెంజింగ్‌గా మాట్లాడాడు సుబ్బారావు.

"అలాగే. నువ్వు ఓడిపోతే నీకు వుద్యోగం వూడుతుంది. కాని నువ్వు చెప్పేది నిజమే అయితే నీకు ప్రమోషన్, డబుల్ ఇంక్రిమెంట్ ఇస్తాను. సరేనా?"

"సరే" ఒప్పుకున్నాడు సుబ్బారావు.

ఆ మంత్రి తన వూరి కామందును పిలిచాడు. ఆయన సుబ్బారావుని చూడగానే "ఓరి సుబ్బిగా! ఎంత పెద్దవాడివై పోయావు?" అని భుజం తట్టాడు.

మంత్రి సుబ్బారావుని ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ దగ్గరికి తీసుకెళ్ళాడు. ఆ ఆంధ్రేతరుడు సుబ్బారావుని చూసి "హలో మిస్టర్ సుబ్రావ్! హౌ ఆర్ యూ?" అని కరచాలనం చేసి సుబ్బారావుతో మాట్లాడాడు.

సుబ్బారావుని ఢిల్లీ తీసుకెళ్ళి ప్రధాన మంత్రి ముందు నిలబెట్టాడు మంత్రివర్యుడు. ఆయన సుబ్బారావుతో ఆనందంగా కరచాలనం చేసి "ఎంత కాలానికి చూసాను. కమాన్. ఇవాళ మా ఇంట్లోనే భోజనం" అని ఆహ్వానించాడు.

మంత్రివర్యుడు మర్నాడు అమెరికాకి వెళుతూ సుబ్బారావుని వెంట తీసుకెళ్ళాడు. సుబ్బారావుని చూడగానే అమెరికన్ ప్రెసిడెంట్ జార్జ్ బుష్, ఆయనతో చర్చల్లో పాల్గొంటున్న రష్యన్ ప్రీమియర్ గోర్బచెవ్ ఇద్దరూ సుబ్బారావుని చూసి అతని భుజం మీద చేతులు వేసి సంతోషంగా చెప్పారు-

"ఎంత కాలానికి దొరికావు మిత్రమా. మన ముగ్గురం కలిసి రమ్మీ ఆడదాం" అన్నారు.

అక్కడా ఓడిపోవడంతో మంత్రివర్యుడు ఆలోచించి అంతదాకా సివిలిజేషన్ తెలియని, ఆఫ్రికాలోని కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడివిలో వున్న ఓ నర మాంసభక్షకుడి దగ్గరికి తీసుకెళ్ళాడు. వాడు కూడా సుబ్బారావును చూసి వాడి భాషలో ఆనందంగా అరిచి కావలించుకోవడంతో మంత్రివర్యుడి మతి పోయినట్టయింది.

"ఓడిపోయాను. అందరూ అనుకున్నట్టుగా నువ్వు నిజంగా 'మిస్టర్ నో ఆల్ వే!'" తన ఓటమిని ఒప్పుకున్నాడు మంత్రివర్యుడు.

"మరి నా ప్రమోషన్, డబుల్ ఇంక్రిమెంట్ మాటేమిటి?" అని సుబ్బారావు అడిగితే "నీ లాంటి వారికి పోస్ట్ మాస్టర్ జనరల్ పదవి ఇచ్చి తీరాలి" చెప్పాడు.

ఆ పదవిని ఇస్తూ హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో అతి పెద్ద బహిరంగసభలో ముఖ్యమంత్రి చేత ఆ పదవి ప్రదానం - అంటే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇప్పించాడు.

ఎన్.టి.ఆర్. సుబ్బారావుకి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తుండగా మంత్రివర్యుడు మూర్ఛపోయాడు. అది గమనించిన సుబ్బారావు ఆయన్ని హాస్పిటల్‌లో పరామర్శించి అడిగాడు.

"ఇంతమంది నాకు తెలిసినా ఏమీ కాని మీరు ఆ సభలో అలా ఎందుకు అకస్మాత్తుగా మూర్ఛపోయారు?"

"ఎందుకా? సభకి వచ్చిన నా చుట్టు ప్రక్కల వాళ్ళలో చాలా మంది 'అడుగో సుబ్బారావు. అతను నా బెస్ట్ ఫ్రెండ్' అన్నారు.

"అందుకనా?" అడిగాడు సుబ్బారావు వింతగా.

"ఊహూ. 'సుబ్బారావుకి ఆ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తున్న కాషాయ బట్టల్లోని ఆయన ఎవరూ' అని అంతా అనుకుంటూండడంతో నాకు మతిపోయి మూర్ఛ వచ్చింది" చెప్పాడా మంత్రివర్యుడు. ●



ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 25-5-90